సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 18 । ఏప్రిల్ । 2024



దర్గాలో రామనామం

మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న ఇల్లెందు సత్యనారాయణ పురం దర్గాలో నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. 8లో

గరిష్టం / కనిష్టం
42° / 26°

వాతావరణం

జిల్లాలో గురువారం ఎండ తీవ్రంగా ఉంటుంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గంటగంటకూ ఉష్ణోగ్రత పెరుగుతుంది.



స్వామివారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న సీఎస్ శాంతికుమారి దంపతులు



కల్యాణానికి వస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు, మంత్రి కొండా సురేఖ



స్వామివారికి వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దంపతులు

కల్యాణ వైభోగమే..



స్వామి వారి పచ్చలహారాన్ని చూపిస్తున్న అర్చకులు



సీతమ్మ వారి మెడలో మాంగల్యాన్ని వేస్తూ...



సీతారాములపై తలంబ్రాలు పోస్తున్న అర్చక స్వాములు

అంగరంగ వైభవంగా శ్రీ సీతారాముల వివాహ వేడుక

- వేద మంత్రాల సాక్షిగా ఒక్కటైన ఆదర్శ జంట
- అభిజిత్ లగ్నంలో స్వామి, అమ్మవార్లకు జీలకర్ర, బెల్లం
- కల్యాణ ఘట్టాలను తిలకించి.. పులకించిన భక్తజనం
- పట్టువస్త్రాలు సమర్పించిన సీఎస్ శాంతికుమారి



భక్తులకు జీలకర్ర, బెల్లం చూపుతున్న అర్చకులు



భద్రాచలం: భద్రగిరి భక్తజన సందోహంతో నిండిపోయింది. అంగరంగ వైభవంగా సాగిన శ్రీ సీతారాముల వారి కల్యాణాన్ని తిలకించిన భక్తులు పులకించిపోయారు. భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో బుధవారం భక్తుల జయజయ ధ్వానాలు, మంగళ వాయిద్యాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ సీతా రాముల కల్యాణం కనుల పండువగా జరిగింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అంతరాలయంలో స్వామివారి మూలమూర్తులను దర్శించుకున్న భక్తులు.. ఆ తర్వాత ఆరాధ్య దైవమైన శ్రీసీతారామచంద్ర స్వామి కల్యాణాన్ని కనులారా చూసేందుకు మిథిలా స్టేడియానికి చేరుకున్నారు. ఉదయం 9:45 గంటలకు ప్రధాన ఆలయం నుంచి సీతారాములతో పాటు లక్ష్మణు డు పల్లకీలో స్టేడియానికి బయలుదేరగా.. భక్తుల కోలాటా లు, భజనలు, మంగళవాయిద్యాల నడుమ మాడ వీధుల గుండా మిథిలా స్టేడియానికి చేరుకున్నారు.

ఆకట్టుకున్న కన్యావరణ..

ఈ వేడుకను ఉదయం 11:12 గంటల నుంచి 11:16 గంటల వరకు నిర్వహించారు. ఇందులోనే ప్రవరలు, యోక్త్రాబంధనం, యజ్ఞోపవీత ధారణ నిర్వహిస్తారు. ముందుగా సీతమ్మ వారికి తగు వరుడి కోసం ఎనిమిది మంది శ్రీవైష్ణవ పండితులు ఎనిమిది దిక్కుల్లో ప్రవరలు చెబుతూ అన్వేషణ సాగిస్తారు. చివరకు శ్రీరాముడిని వరుడిగా ఎన్నుకుంటారు. అనంతరం 11:19 గంటలకు గోత్ర పూజ, కంకణ పూజలు నిర్వహించారు. ఆ తర్వాత ఎనిమిది దర్భలతో కూడిన తాడును సీతమ్మ నడుముకు ధరింప చేస్తూ యోక్త్రాబంధన కార్యక్రమాన్ని ఉదయం 11:22 గంటలకు నిర్వహించి.. ఆ వెంటనే 11.26 గంటలకు బ్రహ్మచారిగా ఉన్న శ్రీరాముడు గృహస్థాశ్రమంలోకి వెళ్తున్నాడనేందుకు గుర్తుగా యజ్ఞోపవీతాన్ని ధరింపజేశారు.

వరపూజ..

శ్రీ వైష్ణవ పండితులు తమను తాము కన్యాదాతాలుగా భావిస్తూ శ్రీరాముడి పాద ప్రక్షాళన చేయడంతో వరపూజ ప్రారంభమైంది. అనంతరం సీతారామ, లక్ష్మణులను రామదాసు చేయించిన ఆభరణాలతో అలంకరించారు. పచ్చల పతకంతో శ్రీరాముడిని, చింతాకు పతకంతో సీతమ్మను, రామమాడ(ఒకవైపు రాముడి పట్టాభిషేకం, మరోవైపు ఆంజనేయుడు ముద్రలు ఉన్న బిళ్ల)ను లక్ష్మణుడికి ధరింపజేశారు. అనంతరం మధుపర్కం నివేదన చేశారు. ఈ కార్యక్రమం ఉదయం 11:30 గంటల నుంచి 11:37 గంటల వరకు కొనసాగింది. అనంతరం వధూవరులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున చీఫ్ సెక్రటరీ శాంతికుమారి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆ తర్వాత త్రిదండి చిన్న జీయర్ మఠం, శృంగేరి పీఠంతో పాటు శ్రీరంగం, తిరుమల తిరుపతి దేవస్థానం వారు, ఇతర ప్రముఖులు పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆపై ఉదయం 11:42 గంటలకు మహా సంకల్ప పఠనం చేశారు.

అభిజిత్ లగ్నం..

మధ్యాహ్నం సరిగ్గా 12 గంటల సమయంలో అభిజిత్ లగ్నం రాగానే జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని భక్తులందరికీ చూపించి వధూవరులైన సీతమ్మ, శ్రీరాముడి తలపై ఉంచారు. ఈ అపురూప క్షణాలను భక్తులందరూ కనులారా చూసి తరించారు.

కల్యాణ ఘట్టం సాగిందిలా..

ఉదయం 10:31 గంటల నుంచి 10:45 గంటల వరకు విశ్వక్సేన పూజ నిర్వహించారు. శ్రీరాముడి సేనాధిపతి అయిన విశ్వక్సేనుడిని గ్రహాధిపతిగా కూడా పేర్కొంటారు. జరగబోయే కల్యాణానికి ఎలాంటి విఘ్నాలు ఎదురుకాకుండా ఈ పూజ నిర్వహించారు. 10:48 గంటల నుంచి 10:56 గంటల వరకు పుణ్యావాచనం నిర్వహించారు. కల్యాణ మండపంలో కలశాన్ని ఏర్పాటు చేసి మంత్రాలు ఉచ్చరిస్తూ ఆ కలశంలోకి పుండరీకాక్షుడిని, సుదర్శనుడుని ఆవాహన చేశారు. ఆ తర్వాత ఈ పుణ్యజలంతో మండలంలో ఉన్న వస్తువులను, పండితులతో పాటు కల్యాణ వేడుకలు చూస్తున్న భక్తులపై చల్లారు. ఈ పూజా కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా అందరికీ మంచి జరగడంతో పాటు కల్యాణ వేడుకలు దినదినప్రవర్ధమానం అవుతాయని పండితులు తెలిపారు. ఉదయం 10:59 గంటల నుంచి 11:11 గంటల వరకు సుయోధ్వాహం నిర్వహించి మిథిలా స్టేడియానికి చేరుకున్న సీతమ్మ వారిని మంత్రపూర్వకంగా కల్యాణ మండపంలోకి తీసుకొచ్చారు.

మాంగళ్యపూజ..

మధ్యాహ్నం 12:10 గంటల సమయంలో మాంగళ్య పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. సాధారణ మంగళ సూత్రంలో రెండు బొట్లు ఉండగా సీతమ్మ మెడలో శ్రీరాముడు కట్టే మంగళ సూత్రానికి మూడు బొట్లు ఉండటం విశేషం. ఒకటి పుట్టింటి వారిది, రెండోది మెట్టింటి వారిది కాగా మూడోది భక్తుల తరుపున శ్రీరామదాసు చేయించినది. సరిగ్గా మధ్యాహ్నం 12:13 గంటలకు మాంగళ్యధారణ వేడుక నిర్వహించారు. ఆ తర్వాత శ్రీరంగంనాథుడు, గోదాదేవి కల్యాణం, బంతులాటకు సంబంధించి ప్రబంధాలు పఠించారు.

తలంబ్రాల వేడుక..

తేనె, గులాల్‌తో పాటు పంచద్రవ్యాలు కలిపిన ముత్యాల తలంబ్రాలను మధ్యాహ్నం 12:23 గంటలకు వధూవరులపై పోశారు. ఈ కార్యక్రమం చూసేందుకు పోటీ పడిన భక్తులు, ఆ తలంబ్రాలు దక్కించుకునేందుకు ఉత్సాహం చూపారు. చివరగా మధ్యాహ్నం 12:39 గంటలకు మంగళహారతి ఇవ్వడంతో సీతారాముల కల్యాణ వేడుక ముగిసింది. అనంతరం పల్లకీలో నూతన వధూవరులను ఆలయంలోకి తీసుకెళ్లారు.



శ్రీ సీతారాముల వారి కల్యాణానికి హాజరైన భక్తులు

న్యూస్‌రీల్

కిన్నెరసానిలో నవమి సందడి



కిన్నెరసానిలో రంగారావు తదితరులు

పాల్వంచరూరల్ : శ్రీరామ నవమి సందర్భంగా కిన్నెరసానిలో పర్యాటకులు బుధవారం సందడి చేశారు. భారీగా తరలివచ్చి జలాశయాన్ని, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. 280 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.10,060 ఆదాయం లభించగా, 100 మంది బోటుషికారు చేయడంతో టూరిజం కార్పొరేషన్‌కు రూ.4,590 వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ రాక..

రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ తన్నీరు రంగారావు, మెంబర్ ఆఫ్ ఎకౌంట్ కృష్ణయ్యతోపాటు ఎన్‌పీడీసీఎల్ డీఈలు విజయ్, ఆనందయ్య, ఏఈ రవీందర్ కుటుంబ సభ్యులతో కలిసి కిన్నెరసానిని సందర్శించారు.

పనులు వేగవంతం చేయండి

ములకలపల్లి: మరో రెండు నెలల్లో వర్షాకాలం రానున్నందున ప్రారంభించిన పనులు త్వరగా పూర్తి చేయాలని ఆర్‌అండ్‌బీ రాష్ట్ర చీఫ్ ఇంజనీర్ మోహన్‌నాయక్ ఆదేశించారు. మండలంలోని తాళ్లపాయ వద్ద పాములేరు వాగుపై నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న పనుల పురోగతి ఎంతవరకు వచ్చిందని అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్యాంప్రసాద్. ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాసరావు, ఏఈ లక్మానాయక్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సమన్వయకర్తల నియామకం

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు బీఆర్‌ఎస్ సమన్వయకర్తలను నియమించింది. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ప్రకటన విడుదల చేశారు. వీరు ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ప్రచారంలో పాల్గొనడంతో పాటు కేడర్‌ను సమన్వయం చేయాల్సి ఉంటుంది. ఈమేరకు పాలేరుకు ఎమ్మెల్సీ తాతా మధు, ఖమ్మంకు డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, వైరాకు తాళ్లూరి జీవన్, మధిరకు మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, కొత్తగూడెంకు ఉప్పలపాటి వెంకటరమణ, సత్తుపల్లికి బీరెడ్డి నాగచంద్రారెడ్డి, అశ్వారావుపేటకు కోనేరు చిన్నిని నియమించారు.

నామినేషన్లకు నగారా!



ఆర్ఓ కార్యాలయంలో సూచనలు చేస్తున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్

- లోక్‌సభ ఎన్నికలకు నేడు నోటిఫికేషన్
- ఈనెల 25 వరకు నామినేషన్ల స్వీకరణ
- ఖమ్మం కలెక్టరేట్‌లోని ఆర్ఓ కార్యాలయంలో ఏర్పాట్లు
- ముహూర్తాలు చూసుకుంటున్న అభ్యర్థులు
- నేడో, రేపో అభ్యర్థిని ప్రకటించనున్న కాంగ్రెస్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: లోక్‌సభ ఎన్నికల్లో కీలక ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ గురువారం మొదలుకానుంది. ఇదేరోజు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేయనుండగా, ఖమ్మం లోక్‌సభ స్థానంలో అభ్యర్థుల నుంచి నామినేషన్ల స్వీకరణకు అధికారులు సిద్ధమయ్యారు. ఏర్పాట్లపై ఖమ్మం కలెక్టర్ వీ.పీ.గౌతమ్ పలుమార్లు సమీక్షించారు. కలెక్టరేట్‌లోని ఆర్ఓ కార్యాలయంలో గురువారం నుంచి ఈనెల 25 వరకు ఉదయం 11నుంచి సాయంత్రం 3 గంటల వరకు నామినేషన్ పత్రాలు స్వీకరిస్తారు. 26న స్క్రూటినీ చేయనుండగా, 29 వరకు ఉపసంహరించుకునే వీలుంది.

అంతా సిద్ధం..

ఖమ్మం కలెక్టరేట్‌లోని ఆర్ఓ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు చేశారు. అభ్యర్థుల కోసం లోక్‌సభ పరిధి ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ఏఆర్ఓ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. అక్కడ నామినేషన్ పత్రాలు అందుబాటులో ఉంచడంతో పాటు ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే వీలు కల్పించారు. కాగా, నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థికి సంబంధించిన మూడు వాహనాలను మాత్రమే కలెక్టరేట్ లోపలికి అనుమతిస్తారు. నామినేషన్ పత్రం ఫారం–2 ఏతో పాటు అఫిడవిట్‌ను ఫారం–26లో సమర్పించాలి. ఈ రెండు ఫారాలు పూర్తిగా నింపాలని పార్టీల ప్రతినిధులకు సూచించారు.

జనరల్ అభ్యర్థులు రూ.25 వేలు..

ఎన్నికల ఖర్చు నిమిత్తం అభ్యర్థులు కొత్త బ్యాంక్ ఖాతా తెరవాల్సి ఉంటుంది. పోటీ చేసే అభ్యర్థి ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ ఓటరు కాకపోతే వారి నియోజకవర్గ పరిధి ఎన్నికల నమోదు అధికారి నుంచి ధ్రువపత్రం సమర్పించాలి. జాతీయ, రాష్ట్రస్థాయి గుర్తింపు పొందిన పార్టీ అభ్యర్థికి ఒక ప్రతిపాదకుడు, గుర్తింపు పొందని పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులను పది మంది ప్రతిపాదించాల్సి ఉంటుంది. బలపరిచే వారు తప్పనిసరిగా ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని వారై ఉండాలి.

అనుమతుల కోసం.

ఎన్నికల ప్రచారం, ర్యాలీల అనుమతి కోసం ఎన్నికల సంఘం సువిధ యాప్‌ను రూపొందించింది. ఈ యాప్ ద్వారా పార్టీలు నాయకులు 48 గంటల ముందు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒకవేళ సువిధ యాప్ ద్వారా సాధ్యం కాకపోతే ఏఆర్ఓ కార్యాలయంలో అనుమతి తీసుకోవాలి. అనుమతి లేకుండా ర్యాలీలు, సభలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటారు. ఇక 85 ఏళ్లు దాటిన వారికి హోం ఓటింగ్ సౌకర్యం కల్పించగా.. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 2,466 మందిని అర్హులుగా గుర్తించారు.

ఇక జనరల్ కేటగిరీ అభ్యర్థులు రూ.25 వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ.12,500 సెక్యూరిటీ డిపాజిట్ చేయాలి.

ముహూర్తంతో ముందుకు..

బీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామ నాగేశ్వరరావు, బీజేపీ అభ్యర్థిగా తాండ్ర వినోద్‌రావును ఇప్పటికే ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ నేడో, రేపో అభ్యర్థిని ప్రకటించనుంది. బీఆర్‌ఎస్, బీజేపీ అభ్యర్థులు మంచి ముహూర్తం చూసుకుని నామినేషన్ దాఖలకు సిద్ధమవుతున్నారు. బీజేపీ అభ్యర్థి వినోద్‌రావు ఈనెల 19న నామినేషన్ దాఖలు చేయాలని నిర్ణయించగా, కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హాజరవుతారని పార్టీ నేతలు తెలిపారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఈనెల 24న నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు.

ఓటర్లు 16,26,427 మంది

ఈనెల 16న ప్రకటించిన ఓటర్ల జాబితా ఆధారంగా ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో 16,26,427 మంది ఓటర్లు ఉన్నారు. అయితే, ఈనెల 25న వెలువరించే తుది జాబితా ఆధారంగా ఎన్నికలు నిర్వహించనుండగా ఈ సంఖ్య పెరిగే అవకాశముంది.

పదేళ్ల కల సాకారం

- భద్రాచలంలో రెండో వంతెనపై రాకపోకలు ప్రారంభం
- కీలకపాత్ర పోషించిన మంత్రి తుమ్మల
- ఆనందం వ్యక్తం చేసిన భక్తులు



రెండు వంతెనలపై సాగుతున్న వాహనాల రాకపోకలు

భద్రాచలంటౌన్: భద్రాచలంలో గోదావరి నదిపై రెండో వంతెన మీదుగా ప్రయాణించాలనే భద్రాద్రి వాసులు, రామయ్య భక్తుల కల పదేళ్ల తర్వాత నెరవేరింది. రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో పనుల్లో వేగం పెంచిన అధికారులు లక్ష్యం మేరకు శ్రీరామనవమి నాటికి వంతెనను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ఎలాంటి ఆర్భాటం లేకుండా కలెక్టర్ ప్రియాంక అల రెండు రోజుల క్రితం బ్రిడ్జిని ప్రారంభించారు. ఈ క్రమాన భద్రాచలం రామయ్య కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులు నూతన వంతెనను చూసి పులకించిపోయారు. ఏళ్లుగా అసంపూర్తిగా దర్శనమిస్తున్న వంతెన అందుబాటులోకి రావడంపై ఆనందం వ్యక్తమైంది.

2015న ఇదే నెలలో శంకుస్థాపన

గోదావరిపై ఉన్న బ్రిడ్జి ప్రస్తుత రద్దీకి సరిపోకపోవడంతో రెండో బ్రిడ్జి నిర్మాణానికి 2015 ఏప్రిల్ 1న శంకుస్థాపన చేశారు. అయితే, 2016లోనే నిర్మాణ పనులు పూర్తిచేయాల్సి ఉన్నా కాంట్రాక్టు సంస్థ జాప్యం చేసింది. దీంతో జాతీయ రహదారుల శాఖ పలుసార్లు నోటీసులు జారీ చేసింది. దీంతో మూడుసార్లు గడువు పెంచుతూ అనుమతులు జారీ చేశారు. మొత్తం 36 పిల్లర్లు, 12 అడుగుల వెడల్పు, ఇరువైపులా ఐదు అడుగుల ఫుట్‌పాత్ ఉండేలా వంతెన నిర్మాణాన్ని డిజైన్ చేశారు. కానీ నిర్మాణ సమయంలో రెండు పిల్లర్లు నాణ్యతా లోపంతో వంగిపోయాయి. దీంతో వాటిని కెమికల్ ట్రీట్‌మెంట్ ద్వారా సరిచేశారు. ఇక నిర్మాణ సంస్థకు జాతీయ రహదారుల శాఖ అధికారులు జరిమానా సైతం విధించారు. ఆపై కరోనా కారణంగా మరో రెండేళ్లు పనులు నిలిచిపోయాయి. ఇంతలోనే బిల్లులు రాక నిర్మాణ సంస్థ కూలీలకు సైతం జీతాలు ఇవ్వలేని పరిస్థితులు ఎదురుకావడంతో కూలీలు స్వస్థలాలకు వెళ్లిపోయారు. ఇలా రకరకాల కారణాలతో బ్రిడ్జి నిర్మాణంలో ఎడతెగని జాప్యం జరిగింది.

ఎంపీ, మాజీ ఎమ్మెల్యే చొరవ.. మంత్రి పర్యవేక్షణ..

వంతెన విషయమై భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, మహబూబాబాద్ ఎంపీ కవిత వేర్వేరుగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. దీంతో ఆయన ఎన్‌హెచ్ అధికారులతో సమీక్షించగా.. వారి హెచ్చరికలతో నిర్మాణ సంస్థ మళ్లీ పనులు ప్రారంభించింది. అయినా జాప్యం జరుగుతుండగా.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెండు నెలల క్రితం పరిశీలించి శ్రీరామనవమి నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అంతేకాక పలుమార్లు ఆయన పర్యవేక్షించడంతో పనులు చకచకా చేపట్టి వంతెనను అందుబాటులోకి తీసుకొచ్చారు. భద్రాచలంలో ఈసారి శ్రీరామనవమికి ట్రాఫిక్ ఇక్కట్లు ఎదురుకాకపోవడానికి రెండు బ్రిడ్జిలు ఉండడం కూడా ఓ కారణంగా చెప్పొచ్చు.

నేడు జగదభిరాముడి పట్టాభిషేకం

- చతుఃస్థానార్చన హోమంతో మొదలు
- నదీ, సముద్ర జలాలతో ప్రత్యేక పూజలు
- ముఖ్య అతిథిగా రానున్న గవర్నర్

భద్రాచలం: త్రేతాయుగంలో శ్రీరాముడి మహాపట్టాభిషేకం స్మరణకు వచ్చేలా అదే చైత్ర పుష్యమి ముహూర్తానా పట్టాభిషేక మహోత్సవాన్ని భద్రాచల పుణ్యక్షేత్రంలో నిర్వహిస్తారు. ఈ క్రమంలో గురువారం ఉదయం యాగశాలలో చతుః స్థానార్చన హోమం నిర్వహిస్తారు. 10 గంటలకు శంఖ, చక్ర, ధనుర్బాణాలు ధరించిన లక్ష్మణ సమేత సీతారాముల ఉత్సవ విగ్రహాలను మేళతాళాలు, కోలాటం, భక్తుల జయజయ ధ్వానాల నడుమ మిథిలా స్టేడియంలోకి తీసుకొస్తారు. సింహాసనంలో వేంచేపు చేశాక ఎలాంటి విఘ్నాలు రాకుండా విశ్వక్సేన పూజ చేస్తారు. ఆ తర్వాత పుణ్యావాచనం చేసి మంత్రజలంతో ప్రాంగణాన్ని, పూజా సామగ్రిని సంప్రోక్షణ చేస్తారు.

మూడు మండపాలు

పట్టాభిషేకం జరిగే ప్రధాన మండపానికి ముందు మూడు ఉప మండపాలు ఏర్పాటుచేస్తారు. ఒక మండపంలో హనుమంతుడు, సుగ్రీవుడు సహా ఎనిమిది మంది రామపరివారం, అష్టదిక్పాలకులను ఆవాహన చేస్తారు. మధ్య మండపంలో మంత్రజలంతో 500 నదులు, నాలుగు సముద్ర జలాలను ఆవాహన చేస్తారు. మూడో మండపంలో శ్రీరాముడికి సంబంధించిన రాజముద్ర, రాజదండం, పాదుకలు ఉంచుతారు. అనంతరం అష్టోత్తర సహస్ర నామార్చన, సువర్ణ పుష్పార్చనలతో పూజలు నిర్వహించి పంచకుండాత్మక, పంచేష్ఠి సహిత చతుర్వేద హవనం, మండపత్రయ ఆరాధన నిర్వహిస్తారు.

ఎనిమిది మంది మంత్రులు

శ్రీరాముడి పట్టాభిషేకం నిర్వహించేందుకు వైదిక మంత్రాలతో వశిష్ఠుడు, వామనుడు, జాబాలి, కశ్యపుడు, కాత్యాయనుడు, గౌతముడు, విజయుడు, సుయజ్ఞుడు అనే 8 మంది మంత్రులను వేద పండితులు వరింపజేసుకుంటారు. అనంతరం పట్టాభిషేక కార్యక్రమం నిర్వహిస్తారు. వీరికి నేతృత్వం వహించేందుకు వాల్మీకి స్థానాన్ని మరొకరు వరింపజేసుకుని పట్టాభిషేక మహోత్సవాన్ని పూర్తి చేస్తారు.

ముఖ్య అతిథిగా గవర్నర్

పట్టాభిషేక వేడుకలకు గవర్నర్లు వచ్చి పట్టు వస్త్రాలు సమర్పించే సంప్రదాయం కొనసాగుతోంది. ఈ ఏడాది కూడా గవర్నర్ రాధాకృష్ణన్ భద్రాచలం రానున్నారు. పట్టాభిషేకం కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షిస్తే విజయసిద్ధి కలుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో సీతారాముల కల్యాణానికి వచ్చిన భక్తులు చాలా మంది పట్టాభిషేకం కోసం భద్రాద్రిలోనే ఉండిపోయారు.

ముమ్మర ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్

బూర్గంపాడు: భద్రాచలంలో గురువారం జరగనున్న శ్రీరామ పట్టాభిషేకానికి ముమ్మర ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రియాంక అల అధికారులను ఆదేశించారు. సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో బుధవారం ఆమె వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. పట్టాభిషేకానికి గవర్నర్ రానున్నందున అధికారులు ఉదయం 6గంటలకే సెక్టార్లకు చేరుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్డీఓ విద్యాచందన, జెడ్పీ సీఈఓ ప్రసూనా రాణి, డీపీఓ చంద్రమౌళి, ఆర్డీఓలు దామోదర్‌రావు, మధు, ఎస్‌డీసీ సుమ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక అల

ఏర్పాట్లు భేష్..

భద్రాచలం పుణ్యక్షేత్రంలో శ్రీరామనవమి వేడుకలు విజయవంతం కావడం హర్షణీయం. భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసిన దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు, కలెక్టర్ ప్రియాంక అల, ఎస్పీ రోహిత్ రాజ్‌కు అభినందనలు. వేసవి దృష్ట్యా చలువ పందిళ్లు, కూలర్లు, తాగునీరు, మజ్జిగ సమకూర్చడమే కాక అత్యవసర వైద్య చికిత్స కేంద్రాల ఏర్పాటు, నిరంతరాయ విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య కార్యక్రమాలు బాగున్నాయి. అధికారుల సమష్టి కృషికి భక్తుల నుంచి మంచి స్పందన వచ్చింది.

– శాంతికుమారి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

సామన్యుడిగానే వచ్చాను..

ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున కుటుంబ సమేతంగా సామాన్య భక్తుడివలే శ్రీ సీతారాముల కల్యాణానికి వచ్చాను. పాస్‌లు కొనుగోలు చేసి కల్యాణం వీక్షించాం. భద్రాద్రి రాముడి దయతో రాష్ట్రమంతా అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నా. సమృద్ధిగా వర్షాలు కురిసి, అన్ని వర్గాల ప్రజలు సుభిక్షంగా ఉండాలని సీతారాములను ప్రార్థించాను.

– మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి

రాముడి దయతో ఇందిరమ్మ రాజ్యం

భద్రాద్రి రాముడి దయతో తెలంగాణలో ప్రజలు కోరుకున్న ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నాం. మా ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ చిత్తశుద్ధితో అమలుచేస్తాం. ఇందిరమ్మ రాజ్యంలో పరిపాలన చల్లగా సాగాలని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని సీతారాములను కోరుకున్నా. తెలుగు ప్రజలందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు.

– పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి

రాముడే నడిపించాడు..


జంగారెడ్డిగూడెంకు చెందిన భక్తురాలు (ఇన్‌సెట్) భక్తురాలి కాళ్లకు బొబ్బలు

భద్రాచలంఅర్బన్: శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలంలో మంగళవారం జరిగిన ఎదుర్కోలు వేడుక, బుధవారం జరిగిన శ్రీ సీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంనకు చెందిన ఓ భక్తురాలు పాదయాత్రగా వచ్చింది. మండే ఎండల్లో నాలుగు రోజులు వంద కిలోమీటర్ల మేర నడుస్తూ వచ్చిన ఆమె కాళ్లకు బొబ్బలు ఎక్కాయి. ఈ సందర్భంగా కాళ్లకు బొబ్బలతో ఇబ్బంది పడుతూనే మిథిలా స్టేడియానికి వచ్చిన ఆమె భక్తిభావాన్ని పలువురు అభినందించారు.

రాములోరి పెళ్లిరోజే హిజ్రాల వివాహం !


చర్ల అభయాంజనేయస్వామి ఆలయంలో పెళ్లి చేసుకున్న హిజ్రాలు

చర్ల రూరల్: శ్రీ రామనవమి రోజున లోకమంతా శ్రీసీతారాముల కల్యాణం జరగగా.. ఆ రోజే హిజ్రాలు సైతం పెళ్లి పీటలెక్కారు. చర్ల మండలం రైసుపేట ఏరియాలోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఏడుగురు హిజ్రాలు బుధవారం పెళ్లి చేసుకున్నారు. సీతారాముల కల్యాణ తంతు పూర్తి కాగానే హిజ్రాలు ఒకరికొకరు బాసింగాలు కట్టుకుని, జీలకర్ర, బెల్లం పెట్టుకున్నారు. తాళిబొట్టు కట్టుకుని, ఆ తర్వాత తలంబ్రాలు పోసుకున్నారు. అయితే రాములోరి పెళ్లి పూర్తి కాగానే తాము వివాహం చేసుకోవడం ఆచారమని హిజ్రాలు చెబుతున్నారు.

రామాలయ నిర్మాణానికి రూ.1.25 లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న రామకృష్ణారెడ్డి

అశ్వాపురం: మండలంలోని మొండికుంటలో శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి జాలె రామకృష్ణారెడ్డి బుధవారం రూ.1,25,116 విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఆలయ నిర్మాణ కమిటీ బాధ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

నదిలో పడిన వ్యక్తిని కాపాడిన గజఈతగాళ్లు

భద్రాచలంఅర్బన్: గోదావరిలో కొట్టుకుపోతున్న వ్యక్తిని గజ ఈతగాళ్లు కాపాడిన ఘటన బుధవారం భద్రాచలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. అశ్వాపురం మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన అంకినపల్లి భద్రయ్య సీతారాముల కల్యాణం వీక్షించేందు కు భద్రాచలం వచ్చాడు. గోదావరిలో స్నానం చేసేందుకు దిగి ప్రమాదవశాత్తూ కొట్టుకుపోతుండగా గజ ఈతగాళ్లు, మత్స్యశాఖ సిబ్బంది గమనించి కాపాడారు. భద్రయ్య కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకుని వారికి కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యశాఖ అధికారి వీరన్న, ఫీల్డ్ ఆఫీసర్ కోటేశ్వరరావు, మత్స్య శాఖ ప్రెసిడెంట్ శ్రీనివాస్, గత ఈతగాళ్లు ఉన్నారు.


గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తజనం

అంతా రామమయం..

శ్రీసీతారాముల కల్యాణాన్ని వీక్షించిన భక్తజనం

- కిక్కిరిసిన భద్రాచల పుణ్యక్షేత్రం
- హాజరైన పలువురు ప్రముఖులు

భద్రాచలంలో బుధవారం జరిగిన శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణాన్ని కనులారా వీక్షించేందుకు వేలాదిగా భక్తులు హాజరయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు మంగళవారం సాయంత్రమే చేరుకున్నారు. బుధవారం తెల్లవారుజామునే పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి మిథిలా స్టేడియంలో జరిగిన కల్యాణోత్సవాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతికుమారి ఏర్పాట్లపై కలెక్టర్ ప్రియాంక తదితరులు సమీక్షిస్తూ భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ఆదేశించారు. కాగా, కల్యాణానికి హాజరైన ప్రముఖుల్లో సుప్రీంకోర్టు న్యాయమూర్తి పమిడిఘంటం శ్రీనరసింహ, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి భీమపాక నగేశ్, అడ్వకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి, ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు ఎస్.హరినాథ్, శ్రీనివాసరెడ్డి, సుమతి, కిరణ్మయి, రవీంద్రనాథ్ తిల్‌హరి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు కిషన్, ఎంపీ మాలోత్ కవిత, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, తెలంగాణ పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఎం.హన్మంతరావు, మల్టీ జోన్–1 ఐజీ ఏవీ రంగనాథ్, జైళ్ల శాఖ ఐజీ వై.రాజేశ్, సింగరేణి సీఎండీ బలరామ్, మిషన్ భగీరథ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేంద్రమోహన్, జిల్లా జడ్జి వసంత్ పాటిల్, కొత్తగూడెం సీనియర్ సివిల్ జడ్జి భానుమతి, జూనియర్ సివిల్ జడ్జి రామారావు, భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి సూరిరెడ్డి, ఖమ్మం జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జీవన్ కుమార్, ఇల్లెందు జూనియర్ సివిల్ జడ్జి కీర్తి చంద్రిక, ఖమ్మం ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి అర్చనాకుమారి, మణుగూరు జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ న్యాయమూర్తి వెంకటేశ్వర్లు, కొత్తగూడెం అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ శివనాయక్ ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజుతో పాటు దేవనాథ రామానుజ జీయర్‌స్వామి, కేంద్ర మాజీ మంత్రి కృష్ణంరాజు భార్య శ్యామలాదేవి, దైవజ్ఞశర్మ తదితరులు ఉన్నారు. కాగా, ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, ఎస్పీ రోహిత్‌రాజ్, భద్రాచలం దేవస్థానం ఈఓ రమాదేవి, ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్ / భద్రాచలం అర్బన్


కల్యాణం వీక్షిస్తున్న యువతులు


గోదావరి ఒడ్డున భక్తుల పూజలు


భద్రాచలం ప్రధాన రహదారిపై వాహనాల రద్దీ


భద్రతా ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న ఎస్పీ రోహిత్‌రాజ్


వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వాహనం


ఎండకు తాళలేక చెట్టునీడలో సేదదీరుతున్న భక్తులు


కల్యాణానికి హాజరవుతున్న సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు శ్రీనరసింహ, భీమపాక నగేష్


తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి


దేవనాథ రామానుజ జీయర్


తలంబ్రాలతో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, సమాచార శాఖ కమిషనర్ హన్మంతరావు


టీటీడీ తరఫున వచ్చిన పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఈఓ రమాదేవి


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ రోహిత్‌రాజ్




శ్రీసీతారాముల కల్యాణానికి హాజరవుతున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు ఎన్.హరినాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కిరణ్మయి


మహబూబాబాద్ ఎంపీ కవిత


సింగరేణి సీఎండీ బలరామ్, ఐజీ రంగనాథ్

దర్గాలో మిన్నంటిన రామనామం

నాగుల్‌మీరా దర్గాలో ఘనంగా సీతారాముల కల్యాణం


దర్గా ప్రాంగణంలో సీతారాముల కల్యాణ వేడుక నిర్వహిస్తున్న పురోహితుడు


సీతమ్మ చీర, సారెకు పూజ చేస్తున్న దర్గా మాలిక్ లక్ష్మీనారాయణ

ఇల్లెందురూరల్: మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న ఇల్లెందు మండలంలోని సత్యనారాయణపురం శివారు హజ్రత్ నాగుల్‌మీరా దర్గాలో బుధవారం సీతారాముల కల్యాణ వేడుక కనులపండువగా సాగింది. దర్గా ప్రాంగణంలో వేసిన మండపంలో పలు గ్రామాల దంపతులు సీతారాముల పక్షాన కూర్చుని పూజలు చేశారు. అనంతరం పురోహితులు కల్యాణ క్రతువు నిర్వహించగా, దర్గా ప్రతినిధులు తెప్పించిన ముత్యాలను గిరిజన భక్తులు సిద్ధం చేసిన గోటి తలంబ్రాల్లో కలిపి సీతారాములకు సమర్పించారు. ఆ తర్వాత దర్గా ప్రతినిధులు రూపొందించిన శ్రీరాముడి పంచాయుధాలకు మాలిక్ లక్ష్మీనారాయణ దూపం వేసి పూజ చేశారు. వీటిని శ్రీరాముడి ఉత్సవ విగ్రహానికి అలంకరించారు.

దర్గా బృందం ప్రత్యేక పూజ

కల్యాణ వేడుక పూర్తయ్యాక భక్తులు సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. మండపంలో దర్గా మాలిక్ లక్ష్మీనారాయణ, దర్గా ప్రతినిధులు సంప్రదాయ పద్ధతిలో పూజ చేసి ఆశీర్వాదం పొందారు. అనంతరం దర్గా ప్రాంగణంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కాగా, నాగుల్‌మీరా దర్గాలో గురు

వెల్లివిరిసిన మత సామరస్యం


కొత్తగూడెంఅర్బన్: మజ్జిగ సిద్ధం చేస్తున్న ముస్లింలు


దమ్మపేట: భక్తులకు తాగునీరు అందజేస్తున్న షేక్ బాషా

కొత్తగూడెంఅర్బన్/దమ్మపేట/ఖమ్మంవన్‌టౌన్: శ్రీ రామనవమి సందర్భంగా ఊరువాడ శ్రీసీతారాముల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ మేరకు పలు ప్రాంతాల్లో ఎండవేడితో ఇబ్బంది పడుతున్న భక్తులకు ముస్లింలు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేసి మత సామరస్యాన్ని చాటారు. కొత్తగూడెంలోని ఉర్దూ ఘర్ వద్ద ముస్లింలు భక్తులకు మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. అలాగే, దమ్మపేటలోని వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించిన శ్రీసీతారాముల కల్యాణ వేడుకకు హాజరైన భక్తులకు షేక్ బాషా తాగునీరు అందజేయగా పలువురు అభినందించారు. ఇక ఖమ్మం 42వ డివిజన్‌లోని నిజాంపేటకు చెందిన ముస్లిం యువకులు వైరారోడ్డులో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అహ్మద్ అలీ, సోహెయిల్, షకీల్, సిద్దిఖీ, గౌస్, అజ్జు, మహబూబ్, రెహాన్, నజీబ్, కరీం, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

పాల్వంచరూరల్: పెద్దమ్మగుడి ఎదుట గల పార్కులో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని జగన్నాథపురం, కేశవాపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మతల్లి ఆలయం ఎదుట పార్కులో బుధవారం సుమారు 60 ఏళ్ల వయస్సు గల వ్యక్తి మృతదేహం లభించింది. 5.5 అడుగల ఎత్తు, చామనచాయ రంగు కోలముఖం, తెల్లరంగు చొక్కా మృతదేహంపై కప్పి ఉందని జగన్నాథపురం పంచాయతీ కార్యదర్శి బుర్ల సాయిరాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని ఏరియాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

ఇద్దరిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: డ్రైవర్ విషయంలో జరిగిన గొడవలో ఒకరిపై మరో ఇద్దరు దాడి చేశారు. దాడి చేసినవారిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. మండలంలోని తొగ్గూడెం గ్రామానికి చెందిన సరియం రంగారావు, బొర్రా సురేశ్ ట్రాక్టర్ డ్రైవర్‌ను మాట్లాడుకునే విషయంలో గొడవపడ్డారు. ఈ క్రమంలో సురేశ్, అతని బావమరిది కలిసి తనపై దాడికి పాల్పడ్డారని రంగారావు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామని ఏఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

మొక్కజొన్న పంట దగ్ధం

గుండాల: అడవిలో నుంచి నిప్పు ఎగిసిపడి ఓ రైతుకు చెందిన మూడెకరాల మొక్కజొన్న చేను పూర్తిగా దగ్ధమైన ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పడుగోనిగూడెం గ్రామానికి చెందిన రైతు ఊకె మల్లయ్య యాసంగిలో మూడు ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశాడు. ప్రస్తుతం పంట చేతికొచ్చింది. ఈ క్రమంలో మధ్యాహ్నం స్థానికంగా ఉన్న అడవి కాలుతూ నిప్పులు ఎగిసి చేనులో పడడంతో చేనంతా కాలిపోయింది. సమాచారం అందుకున్న ఆ రైతు చేను వద్దకు వచ్చేసరికి కాలిబూడిదైంది. సుమారు రూ.లక్షన్నర వరకు నష్టం వాటిల్లిందని రైతు, ఆయన కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

అశ్వారావుపేటరూరల్: కోడి పందేలు నిర్వహిస్తున్న ప్రాంతంలో బుధవారం పోలీసులు దాడి చేశారు. మండలంలోని అల్లిగూడెం సమీపంలోని అటవీ ప్రాంతంలో కొందరు కోడి పందేలు నిర్వహిస్తుండగా, సమాచారం మేరకు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని ఎస్‌ఐ శ్రీరాముల శ్రీను తెలిపారు. పట్టుబడిన వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రెండు ద్విచక్రవాహనాలు, రూ.4,500 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

అక్రమ మద్యం సీజ్

దమ్మపేట: అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ దుకాణంపై ఎఫ్ఎస్ టీం, పోలీసులు కలిసి దాడి చేశారు. మండలంలోని చలమప్పగూడెం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు ఎఫ్ఎస్ టీం అధికారి కృష్ణ ఆధ్వర్యంలో బెల్ట్ షాపుపై మంగళవారం రాత్రి దాడి చేసి, నిల్వ ఉంచిన 250 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. వీటిని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌లో అప్పగించామని ఎఫ్ఎస్ టీం అధికారి తెలిపారు.